# ప్రేమించి పెళ్ళిచేసుకో!

అది రాత్రి సమయం. గడియారం పదిగంటలు కొట్టింది. గదిలో లైటు ఇంకా వెలుగుతూనే వుంది. భాస్కర్ ఈజీ చైర్లో కూర్చుని ఏదో వ్రాస్తున్నాడు. అతని ఎదురుగావున్న మంచంపై పండుకుని ఏదో నవల చదువుకుంటోంది భారతి. కాసేపయ్యాక పుస్తకం మూసేసి, భాస్కర్ వైపు చూసింది. భాస్కర్ అదేపనిగా వ్రాస్తున్నాడు. బహుశా ఆఫీసుపని చూసుకుంటున్నాడు గాబోలు ననుకుంది భారతి.

'అబ్బ ఇంక చాల్లేండి! నాకు నిద్రొస్తుంది' అంది ఆవలిస్తూ. భాస్కర్ ఆమె వైపొకసారి చూసి మళ్ళీ తనపనిలో నిమగ్నమయ్యాడు.

భారతి వచ్చి అతనిముందు పాలగ్లాసుపెట్టి, 'ఊఁ త్వరగా త్రాగండి, పాలు చల్లారిపోతాయి.' అంది. భాస్కర్ వ్రాతపని పూర్తయింది గాబోలు, తను వ్రాస్తున్న కాగితాల్ని ఫైలులో భద్రపరిచాడు. భారతి పాలగ్లాసు అతని నోటికందించింది. లేకపోతే త్రాగడేమోనని. చిన్న పిల్లాడిలా సగంపాలు గటగటా త్రాగి' మిగిలినవి భారతికిస్తూ 'ఇవి నువ్వు త్రాగు' అన్నాడు భాస్కర్.

'ఇప్పటికి నేను గుర్తొచ్చానన్నమాట' అంది నిష్ఠూరంగా పాలగ్లాసందుకుంటూ. భాస్కర్ ఆమె వైపు చూచి చిలిపిగా నవ్వాడు.

'మీకు నవ్వొస్తుంది లెండి. ఇందాకట్నుంచి చూస్తున్నా, మీ పనేమో మీరేమో, ఆఫీసుపని అంత ఇంతరెస్టుగా వుంటుందా యేం? అంది.

'ఇది ఆఫీసుపని గాదు భారతీ!'

'మరి?' ప్రశ్నార్థకంగా చూచింది భారతి.

'నేనొక కథవ్రాస్తున్నాను భారతీ. బాగుంటే పత్రికకు పంపించాలని...'

'కథ నాకు చూపించకూడదా?'

'నీకు చూపించకుండా వుంటానా? నువ్వు నా మొదటిపాఠకురాలివి గదూ?' అంటూ ఆమె నున్నని బుగ్గపై చిన్నగా చిటిక వేశాడు భాస్కర్.

'ఒహో అయితే ఇప్పటినుండి తమరు రచయితగారన్నమాట' అంది నవ్వుతూ.

'రేపు నాకథ చదివినతర్వాత...అలాగే పిలు' అంటూ మంచం దగ్గరకు వెళ్ళాడు భాస్కర్. అతణ్ణి అనుసరించింది భారతి. లైటు ఆరిపోయింది.

భాస్కర్, భారతీల వివాహం జరిగి ఇప్పటికి ఆరు నెలలయింది. కాలేజిలో ప్రేమించుకొని, చదువు పూర్తి కాగానే పెళ్ళిచేసుకున్నారు. భారతి వివాహం చేసుకోవడం తల్లిదండ్రులకు అంతగా నచ్చలేదు...కాని తనతల్లి నెలాగో ఒప్పించి తన పంతం నెగ్గించుకొన్నాడు భాస్కర్.



పద్మశ్రీవారి

'వింతకాపురం' లో

కాంచన-విజయలలిత.

ఉదయం ఏడుగంటలయింది. కిటికీలోనుండి నులివెచ్చని అరుణకిరణాల స్పర్శకు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ నిద్రలేచాడు భాస్కర్. వంట గదిలోనుండి భారతి పైట చెంగు బొడ్డులో దోపుకుని, చేతులకు, ముఖానికి మసిపూసుకుని మసి వచ్చింది. ఆమె తీరుచూస్తే భాస్కర్‌కు నవ్వొచ్చింది.

'చూడు భారతీ వంటచేస్తున్నంత మాత్రాన ఒళ్ళంతా మసి పూసుకోవాలనుందా?' అన్నాడు నవ్వుతూ.

'రచయిత అయినంత మాత్రాన ఆలస్యంగా నిద్ర లేవాలని లేదు. తొందరగా ముఖం కడుక్కొనిరండి, ఉప్మా తిందురుగాని...' అంటూ చరచరా లోనికిపోయింది భారతి. ఆమె పోయినవైపే చూస్తున్నాడు భాస్కర్. తనంటే భారతికి ఎంతో ప్రేమ, గౌరవం వున్నాయి. భారతికి అందమున్నా అహంకారం లేదు. ఒకసారి భాస్కర్ అన్నాడు. 'భారతీ నీకు గర్వంలేదు సుమా! నువ్వు చాలా మంచిదానివి' అని. భారతి నవ్వి, 'ఎందుకు లేదండీ? మీలాంటి భర్త లభించినందుకు నాకు గర్వం వుండదా?' అంది. భాస్కర్ ఎంతో మురిసిపోయాడు.

ఆలోచనల్లోంచి తేరుకుని బాత్‌రూమ్ వైపు దారి తీశాడు భాస్కర్. కాసేపటికి తిరిగివచ్చాక కాఫీ, టిఫిన్‌లు ముగించారిద్దరూ.

+ + +

నీట్‌గా తెల్ల బట్టలు వేసుకుని అద్దం ఎదురుగా నిల్చుని తలదువ్వుకుంటున్నాడు భాస్కర్. 'భారతీ ఒక

రచన:

శ్రీ ఆర్. పి. నిరంజన్ దేవ్.

సారి ఇలా రా' పిల్చాడు భాస్కర్. 'ఆఁ వస్తున్నా వుండండి' లోపలినుండి భారతి సమాధానం. కాసేపట్లోవచ్చింది భారతి.' అబ్బబ్బ... ఈ జుత్తు బొత్తిగా మాట వినడంలేదు భారతీ. కాస్త దువ్వి పెడుదూ. ప్లీజ్...' అంటూ నసిగాడు భాస్కర్.

'ఏదో పెద్దపని వున్నట్టు పిలిచారే మరి, నేను దువ్వను బాబూ' అంటూ అక్కణ్ణుంచి తప్పించుకోబోయింది. భాస్కర్ ఆమె చెయ్యిపట్టుకుని వెనక్కిలాగాడు. ఆమె కోపం నటించింది. భాస్కర్ మూతి ముడుచుకున్నాడు. భారతికి అతనిని చూడగనే జాలేసింది. అతని కోరికల్ని ఏనాడూ త్రోసిపుచ్చలేదు. అతని చేతిలోని దువ్వెన తీసుకుని మృదువుగా దువ్వసాగింది. 'మీరు మరీ చిన్నపిల్లాడిలా మారాంచేస్తున్నారండీ' అంది భారతి చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ.

'నువ్వున్నంతకాలం నేను చిన్న పిల్లాడినే భారతీ' అంటూ కౌగలించుకోబోయాడు భాస్కర్.

'ఇంక వదలండి. వాళ్ళు చూస్తున్నారు.' అంది ఆందోళన నటిస్తూ.

'ఎవరు?' అన్నాడు అమాయకంగా.

'అటు చూడండి' అంటూ అద్దంవైపు చూపించింది.

అద్దంలో...ఒకరి కెదురుగా నొకరు దగ్గఱగా నిల

చిన్నిబ్రదర్స్‌వారి

'వంశముధరణి'లో

శోభన్ బాబు

విజయలలిత.



బడ్డ భాస్కర్, భారతీల ప్రతిబింబాలు స్పష్టంగా కనపడుతున్నాయి.

'ఛంపావు పో. నే నింకెవరో అనుకున్నాను.' అన్నాడు నవ్వుతూ.

'సరేగాని భారతీ ఆ బీరువాలో నా ఫైలుంది తీసుకురా' అన్నాడు. భారతి ఆ ఫైలు తెచ్చింది.

'ఇదిగో నేను వ్రాసినకథ బాగుంటే పత్రికకు పంపిద్దాం.' అన్నాడు భారతికి ఆ కాగితాలు చూపిస్తూ. భారతి ఆ కథ తీసుకుంది. భాస్కర్ వెళ్ళిపోయాక చదవడానికి.

భాస్కర్ ఆఫీసుకి బయలుదేరాడు.

భాస్కర్ సాహిత్యాభిమాని. కథలంటే చాలా యిష్టం. ప్రతి రాత్రి భారతికి తాను చదివిన కథలు, నవలలు గురించి చెప్పేవాడు. 'మీరూ ఓ కథ వ్రాయకూడదటండీ?' అనేది భారతి. 'చూద్దాంలే' అనేవాడు భాస్కర్. కాని ఇప్పుడు నిజంగానే కథ వ్రాశాడు. 'నువ్వు నా మొదటి పాఠకురాలివిగదూ' అన్న భాస్కర్ మాటలు గుర్తొచ్చాయి భారతికి. త్వరత్వరగా పని ముగించుకుని మెత్తని బెడ్ పై పండుకుని భాస్కర్ వ్రాసిన కథ చదవటాని కుపక్రమించింది భారతి...

\+ \+ \+

...'అనగనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో అందమైన ఒక కాలేజి. అందులో ఇంకా అందమైన అమ్మాయిలు, అబ్బాయిలు చదువుకుంటున్నారు. నేనుకూడా అదే వూళ్ళో వుండడంవలన అదే కాలేజిలో చదువుకుంటున్నాను. మా నాన్న రిటైర్డు ఆఫీసరు.

అసలేం జరిగిందంటే...ఆ రోజు కాలేజికి వెళ్ళడం లేటయినందువల్ల స్పీడ్ గా కాలేజి మెట్లెక్కుతున్నాను, తల వంచుకుని. నిదానంగా దిగవస్తున్న ఒక అమ్మాయికి 'ఢీ' కొన్నాను. అనుకోకుండా జరిగిన యీ సంఘటనకు నేనూ, ఆ అమ్మాయి బిత్తరపోయాము. ఢీ కొన్నందుకు ఆ అమ్మాయి ఏమనుకోలేదుగాని, పాపం పుస్తకాలన్నీ క్రింద చిందరవందరగా పడ్డందుకు బాధపడింది. 'సారీ' అంటూ అమ్మాయి పుస్తకాలు తీసి యిచ్చి, నావి నేను తీసుకున్నాను. ఆ అమ్మాయి వెళ్ళిపోబోయింది. 'జరిగిందానికి ఏమీ అనుకోకండీ' అన్నాను. 'చూసి నడవడం నేర్చుకోండి' అంది సీరియస్ గా ముఖం పెట్టి వెళ్తూ.

రెండవ రోజు సాయంత్రం నేను కాలేజినుండి ఇంటికి తిరిగి వస్తున్నాను.

'ఏమండీ' అని ఎవరో పిలిచారు. కోయిల పాట పాడినంత మధురంగా వుందా కంఠస్వరం.

వెనుదిరిగి చూశాను. నా కాశ్చర్యమేసింది. అవును నిన్నటి అమ్మాయే, 'నన్నేనా పిలుస్తున్నారు' అన్నాను.

'అవునండీ. ఇంకెవరున్నారిక్కడ' అంది. చుట్టూ చూశాను. నిజంగా ఎవరూ లేరు. లేకపోతే ఆడపిల్ల ఇంత ధైర్యంగా మాట్లాడటమేమిటి? అనుకున్నాను.

'చూడండి, నిన్నటి రోజున...' అంటూ ఏదో చెప్పబోయేంతలో___

'ఆ సంఘటన మళ్ళీ గుర్తుచేయకండి. ఏదో పొరపాటు జరిగిపోయింది' అన్నాను నాదే పొరపాటులాగ.

'దానిదేముందిలెండి. పొరపాట్లు జరుగకుండా వుంటాయా?' అంది కిలకిలా నవ్వుతూ. ఆమె ముత్యాల పలువరస జిగేల్ మంది.

ఎక్కువ పరిచయం లేకపోయినా నాతో ఇంత చనువుగా మాట్లాడటం నాకే ఆశ్చర్యమేసింది. 'మీరు చాలా చక్కగా నవ్వుతారండీ' అన్నాను ఆమెవైపు చూస్తూ. ఆమె సిగ్గుతో తల దించుకుంది. ఆమె ముసిగా నవ్వుకోవడం నేను గమనించకపోలేదు. ఆ అమ్మాయి పుస్తకాల్లోంచి ఒక పుస్తకాన్ని తీసి నాకిస్తూ, 'ఇదిగో! మీ పుస్తకం. నిన్న జరిగిన 'పొరపాటు'లో నా పుస్తకాల్లో కలిసింది' అంది.

నేను నా పుస్తకాన్ని తీసుకుంటూ, 'చాలా థాంక్సండీ! ఈ పుస్తకంకోసం ఇల్లంతా వెదికాననుకోండి' అంటూ ఆ అమ్మాయివైపు కృతజ్ఞతాభావంతో చూశాను.

'ఫర్వాలేదులెండి. ఇక నే వెళ్తాను' అని వెళ్ళిందా అమ్మాయి. అలానే చూస్తూ నిలబడ్డాను ప్రక్కన సైకిల్ బెల్ వినిపించేంతవరకు. 'ఏరా బ్రదర్ లవ్ ఎఫైర్ ఏదైనా' అంటూ గొణిగాడు ప్రసాద్. 'ఛ. నోరుమూసుకొని రారా' అంటూ వాడి సైకిల్ మీద ఎక్కి ఇంటికి వచ్చాను.

ఇంటికి వెళ్ళిన తరువాత పండుకుని ఆలోచిస్తున్నాను. 'ఆ అమ్మాయి ఏం చదువుతుందో. ఛ. ఆ అమ్మాయి పేరు ఏమిటోకూడ తెలుసుకోలేదు. ఎంత సుందరమైన రూపం! ఎక్కడో చూసినట్లే అనిపిస్తూంది. ఎలాగైనా ఆ అమ్మాయితో పరిచయం పెంచుకోవాలనిపించింది.

ఒకరోజు సాయంత్రం అలా షికారుకి బయలుదేరి పోతున్నాను, ఆ అమ్మాయి ఇంటివైపే. ఇంటి చుట్టూ ప్రహరీగోడలోపల చిన్న తోట. ఆ తోటలో ఒక చోట కూర్చుని పూలు కట్టుకుంటుందా అమ్మాయి. నేను గేటు దగ్గఱకి రాగానే, 'లోపలికి రండి' అంటూ ఆహ్వానించింది. 'ఇంట్లో ఎవరూ లేరేమో' అనుకుంటూ ఆమె ననుసరించాను. తోటలో ఒక బెంచి వుంది. ఆ బెంచిమీద కూర్చున్నాను నేను. చల్లని గాలికి, పూల సౌరభాలతో మనసు మత్తెక్కి పోయింది. ఆమె నిలబడి వుంది. 'అరె మీరు నిలబడ్డారే! కూర్చోండి' అన్నాను. బెంచిమీద నాకు కొద్ది దూరంలో కూర్చుంది.

'మా పిన్నివాళ్ళు ఇప్పుడే పిక్చర్ కి వెళ్ళారండి' అంది.

'మరి మీరు వెళ్ళలేదే?' అన్నాను.

'నాకంతగా ఇంటరెస్ట్ లేదండీ' అంది.

'మరిచిపోయాను. అసలు మీ పేరు తెలుసుకోన లేదు' అన్నాను ఆమెవైపు చూస్తూ.

'మీరు చెప్పండి ముందు' అంది.

'నో నో లేడీస్ ఫస్ట్' అన్నాను.

'నా పేరు రాధారాణి.' అంది సిగ్గుపడుతూ.

పేరుచెప్పడానికే ఇంత 'ఇది' ఎందుకో అర్థంగా లేదు.

'నాపేరు రాజా' అన్నాను. ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

'చక్కగా వుంది' అంది.

'ఏమిటి చక్కగా వుంది? నేనా? నాపేరా?'

'మీ పేరండీ'

'మరి నేనూ?'

ఫక్కున నవ్వింది రాణి.

'మీరుకూడా' అంది మళ్ళీ నవ్వుతూ.

ఇలా పెరుగుతూవచ్చిన మా స్నేహం ప్రేమగామారటానికి ఎక్కువరోజులు పట్టలేదు. మొదట సద్దుకిమి చూసినప్పుడు 'మొండిఘటం' అనుకున్నా ఆమెలో శాంతం, ఓర్పు, ప్రేమ, యిత్యాది విటమిన్ లున్నాయని ఆమెతో స్నేహం చేశాక తెలిశాయి.

ఒకసారి రాణి వాళ్ళూరికి రమ్మని ఆహ్వానించింది. నా కర్థంగా లేదు. 'మీదేవూరు?' అన్నాను,

'మా దీవూరు కాదుగా?' అంది.

అప్పుడు రాణి చెప్పింది 'వాళ్ళ కుటుంబం వేరే చోటవుంటుందనీ అక్కడ కొన్ని క్లిష్టపరిస్థితులవల్ల ఇక్కడ వారి కుటుంబస్నేహితులవద్ద వుంటున్నాననీ' చెప్పింది. వారి యింటికి తప్పక రావలసిందిగా చేతిలో చేయివేసుకుని మరీ ప్రయాణం చేయించుకుంది రాణి.

\+ + +

రాణి ఆహ్వానాన్ని పురస్కరించుకుని వాళ్ళూరికి వెళ్ళాను. వాళ్ళ ఇల్లు చాలా సింపిల్ గా, డీసెంట్ గా వుంది. అయితే నేను వెళ్ళిన సమయానికి వాళ్ళనాన్నతోపాటు, వాళ్ళ అమ్మకూడా నాగార్జున సాగర్ కాంప్ కి వెళ్ళిందట.

ఇంటి లోపల గోడకు తగిలించిన ఫోటోలను పరిశీలిస్తూన్నాను. నా ప్రక్కగానున్న ఫోటోను చూచి వులిక్కిపడ్డాను. అవును! సందేహం లేదు!! ఇది...ఇది మా ఇంట్లోవున్న ఫోటో...మరి ఇక్కడికెలావచ్చింది? నాకంతా అయోమయంగా వుంది.

'రాణీ!' నా పిలుపుకి పరిగెత్తుకుంటూ లోపలికి వచ్చింది.

'ఏమిట'న్నట్టు నావైపు చూసింది రాణి.

'రాణీ ఈ ఫోటో...' అంటూ అడగబోయేంతలో,

'మా అమ్మదే' అంటూ సమాధానమిచ్చింది రాణి.

అసలే తడబాటుతో నున్న నాకు ఆ సమాధానం వినేసరికి పక్కలో బాంబు పేలినట్టయింది. ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూండగా రాణి అంది;' ఎందుకంత కంగారుపడ్డారు. బహుశా మా అమ్మ నెక్కడయినా చూశారేమో.'

'అబ్బే! ఏం లేదు. కాసిని మంచినీళ్ళు తీసుకురా.'

రాణి వెళ్ళింది. నేను ఆలోచనలోపడ్డాను. మా స్నేహంలో ఈ బాంధవ్యం యిమిడివున్నదన్న సంగతి యిప్పటివరకు తెలియకపోవడం ఎంత విచిత్రం? ఈ సంబంధానికి మా నాన్న ఒప్పుకుంటాడా? ఇప్పటివరకూ రాని సందేహం ఇప్పుడు వచ్చింది. రాణి తెచ్చిన నీళ్లు

త్రాగాక, 'రాణీ నీకో రహస్యం చెబుతారా!' అంటూ చెరో కుర్చీలో కూర్చున్నాం. ఇరవై ఏళ్ళ క్రిందట జరిగిన సంఘటన :

మా నాన్నకో చెల్లెలుండేది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయినందువల్ల మా నాన్న ఎలాగో ఆమెను పెంచి పెద్దచేశాడు. ఆమెకు మంచి పెళ్ళి సంబంధం కూడా చూశాడు. కాని...ఆమె ఆ పెళ్ళి నిరాకరించింది. ఆమె ఎవర్నో ప్రేంచిందట. అతణ్ణే పెళ్ళిచేసుకుంటానని పట్టుబట్టింది. మా నాన్న వీల్లేదన్నాడు. కాని ఆమె మాత్రం చాటుగా గుళ్ళో పెళ్లి చేసుకుంది. మా నాన్న, 'నీకూ నాకూ ఏ సంబంధం లేదు. నీవు నా గడప త్రొక్కడానికి వీల్లేదన్నాడు.' అంతే! వాళ్ళిద్దరిమధ్య తీవ్రమైన విబేధాలేర్పడ్డాయి. – రాణీ ఈ కథంతా మా అమ్మ చెప్పింది.

'మరి మీ అత్తమ్మను నీ వెప్పుడూ చూడలేదా?' అంది రాణి.

'మా నాన్నపైకి అంత కోపంగా మాట్లాడినా, మా అత్తమ్మను పెంచిన మమకారం పోలేదు. అందుకని ఆమె ఫోటోను మా ఇంట్లో గోడకి తగిలించాడు. అప్పుడు చూశాను.'

'రాణీ! నువ్వు...నువ్వు ఆ అత్తమ్మ కూతురివే' రాణీ.

'అఁ!' క్షణకాలంపాటు నివ్వెరపోయింది రాణి.

'అవును' ఈ ఫోటోలోవున్న మీ అమ్మ, మా అత్తమ్మ. ఇదే ఫోటో మా ఇంట్లో వుంది.'

రాణి నాదగ్గరకువచ్చి నిలబడింది.

'రాణీ! మనం కలయిక నిజంగా ఎంత విచిత్రమయింది. ఆత్మీయత మనల్ని దగ్గరకు చేర్చింది.' అంటూ రాణిని నాగుండెల కదుము కున్నాను...

మా నాన్నను, అమ్మను ఒప్పించి, మా కుటుంబం, రాణివాళ్ల కుటుంబం ఏకమవ్వాలని చేసిన ప్రయత్నం సఫలమయ్యింది.

రాణికీ, నాకూ వైభవోపేతంగా వివాహం జేశారు.

మా నాన్న, అత్తమ్మ ఏకమయ్యారు. అత్తమ్మను నాన్న క్షమించాడని వేరే చెప్పాలా?

రాణిని ప్రేమించి పెళ్ళిచేసుకున్న నన్ను మిత్రులు ప్రశంశల వర్షం కురిపించారు.

\+ + +

గాఢంగా నిట్టూర్చి కథ చదువుతున్న భారతి ఆ కాగితాల్ని తిరిగి ఫైలులో భద్రపరిచింది.

భాస్కర్ ఆఫీసుండి రాగానే, కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది భారతి. కాఫీ త్రాగడం ముగించాక, 'కథ చదివేవా? భారతీ' ప్రశ్నించాడు భాస్కర్.

'మన కథేనా? ఓ! మన కాలేజి రోజుల్ని మళ్ళీ గుర్తు చేశారండీ!' పేరు పెట్టలేదేం?' అంది.

'నువ్వే చెప్పు.'

'బాగుంది మీరు కథ వ్రాయడమూ, నేను పేరు పెట్టడమా?'

'ఈ కథలో నేను, నిన్ను...సారీ' హీరో, హీరోయిన్ని ప్రేమించి పెళ్ళిచేసుకుంటాడుగా అందుకని...

'ప్రేమించి పెళ్లిచేసుకో!' అని పేరు పెడ్తారా.? అంది నవ్వుతూ.

'కరెక్ట్' అంటూ తనకథను మళ్లీ సరి చూసుకున్నాడు భాస్కర్.

'ఏమండోయ్ మనల్ని పండుగకి రమ్మని మామయ్య లెటర్ వ్రాశాడు.'

'థట్స్ వెరీ గుడ్. దానికేం పోదాం.' అంటూ లోనికి పోయాడు భాస్కర్.

